క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద అన్నసమారాధన



అన్నసమారాధనలో భోజనం వడ్డిస్తున్న ఆకుల వీర్రాజు

రాజమహేంద్రవరం రూరల్: నామవరం రోడ్డులోని పిట్టలవానిచెరువు వద్ద వేంచేసి యున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీవరప్రద వేంకటేశ్వరస్వామి ఆలయం 15వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. శ్రీవారి సేవా కమిటీ, కొప్పిశెట్టి బ్రదర్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు భక్తులకు భోజనం వడ్డించి అన్నసమారాధనను ప్రారంభించారు. ముందుగా ఆయన స్వామివారిని దర్శించుకున్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



కడియంలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గోరంట్ల తదితరులు

కడియం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రాన్ని శనివారం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రారంభించారు. కడియం ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ మహిళలకు వృత్తి నైపుణ్యాలు పెంపొందించే కార్యక్రమంలో భాగంగా ప్రతి మండలంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. 249 మంది లబ్ధిదారులకు 90 రోజుల పాటు శిక్షణ ఇచ్చి, కుట్టు మిషన్‌ను ఉచితంగా అందజేస్తారన్నారు. ఎంపీడీవో రమేష్, నాయకులు మజ్జి పద్మావతి, వెలుగుబంటి రఘురామ్, పంతం గణపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ గోదావరి నీరు

కడియం: మండలంలో ప్రతి ఇంటికీ గోదావరి నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. శనివారం మండలంలోని జేగురుపాడు, కడియపులంక పంచాయతీ పరిధిలోని దోసాలమ్మ కాలనీలో వాటర్ ట్యాంకులను ఆయన ప్రారంభించారు. దుళ్ల యర్రకాలనీల్లో వాటర్ ట్యాంకు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. సుమారు 1.47 కోట్లతో ఈ ట్యాంకులను నిర్మించినట్టు చెప్పారు. దుళ్ల హైస్కూల్లో పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయన సత్కరించి నగదు ప్రోత్సాహాన్ని అందజేసారు. స్కూలు గ్రౌండ్ అభివృద్ధికి రూ.లక్ష సొంత నిధులను ఎస్‌యంసీ కమిటీ, ఉపాధ్యాయులకు అందజేసారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న మంత్రి కందుల దుర్గేష్

ధవళేశ్వరం: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. శనివారం ధవళేశ్వరం బాలుర హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ వీల్‌చైర్ క్రికెట్ ఎగ్జిబిషన్ టీ10 టోర్నమెంట్ విజేతలకు కందుల దుర్గేష్ బహుమతులను అందజేశారు. దివ్యాంగులను ప్రోత్సహించే విధంగా ఇటువంటి పోటీలు నిర్వహించడం హర్షణీయమని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన ఆంధ్ర రైడర్స్ జట్టుకు విన్నర్స్ ట్రోఫీని , ఆంధ్ర ఫైటర్స్ జట్టుకు రన్నర్స్ ట్రోఫీని ఆయన అందజేశారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం పార్లమెంటు పరిధిలో ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు దగ్గుబాటి పురందేశ్వరి ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేస్తుంటే మాజీ ఎంపీ భరత్‌రామ్ ఓర్వలేక వ్యంగ్యంగా మాట్లాడటం బాధాకరమని జిల్లా బీజేపీ అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. శనివారం నగరంలో బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంపీ పురందేశ్వరి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజల ప్రయోజనాల కోసం రూ.2 కోట్ల విలువ చేసే 62.5 కేవీ జనరేటర్, అధునాతనమైన అంబులెన్స్, 20 ఇన్వర్టర్లు, ఇతర అవసరమైన పరికరాలు ఏర్పాటు చేసారన్నారు. ఎంపీగా పురందేశ్వరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌తో కలసి కేంద్ర ఆయుష్ మంత్రితో మాట్లాడి అల్లు రామలింగయ్య హోమియోపతి కాలేజీలో పీజీ సీట్లను తీసుకువచ్చారన్నారు.

వడదెబ్బ.. జాగ్రత్తసుమా!

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- వడదెబ్బతో ప్రాణాలకు ప్రమాదమంటున్న వైద్యులు
- కొద్దిపాటి జాగ్రత్తలు అవసరం



మండుటెండలో వెళ్తున్న మహిళలు

రాజమహేంద్రవరం రూరల్: సాధారణంగా మేలో ఎండలు విపరీతంగా ఉంటాయి. పర్యావరణ విధ్వంసంతో వాతావరణంలో పలు మార్పులు వచ్చాయి. పచ్చని చెట్లు తగ్గిపోయి భూగోళం వేడెక్కిపోవడంతో ఏప్రిల్‌లోనే సూరీడు సుర్రుమంటున్నాడు. సాధారణ ఉష్ణోగ్రతల కంటే ఎక్కువగా నమోదవుతున్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు దీనికి అద్దం పడుతోంది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆశాఖ ముందస్తు సూచనలు విడుదల చేసింది. వేసవిలో కొద్దిపాటి జాగ్రత్తలు పాటించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వడదెబ్బకు గురై ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందని వైద్యులు అంటున్నారు.

వడదెబ్బ తగిలేది ఇలా...

మానవ శరీరంలో ఐదు లీటర్ల మేరకు నీరు ఉంటుంది. అన్ని జీవక్రియలకు ఇది అత్యవసరం. శరీరంలో ఉష్ణోగ్రత 37 డిగ్రీలు(98.6 ఫారెన్ హీట్) ఉంటుంది. బయటి వాతావరణంలో ఉష్ణోగ్రత 37 డిగ్రీలు దాటినప్పుడు మన శరీరం ఎండ ప్రభావానికి లోనవుతుంది. అప్పుడు ఉక్కపోతగా ఉన్నట్లు అనిపిస్తుంది. ఆ సమయంలో శరీరం చల్లబడేందుకు అసంకల్పిత ప్రతీకారచర్యగా శరీరంలోని నీరు బయటకు వచ్చి సమతాస్థితికి చేరుకుంటుంది. చెమట బయటకు రాకున్నా శరీరంలోని నీరు స్వేద గ్రంథుల ద్వారా ఆవిరి అవుతూనే ఉంటుంది. దీనిని మనం గుర్తించలేం. ఇలా బయటకు వెళ్లిన నీటిని ఎప్పటికప్పుడు భర్తీ చేయాల్సిందే. ఆలస్యమయ్యే కొద్దీ జీవక్రియలు మందగిస్తాయి. ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది.

వడ దెబ్బ లక్షణాలు

తలనొప్పి, తలతిరగటం, శరీరంలోని నీరు అంతా పోతుంది. ఎండిపోయిన చర్మంతో ఎక్కువ జ్వరం కలిగి ఉండటం, మత్తునిద్ర, కలవరింతలు, జ్వరం 106 డిగ్రీలు దాటగానే ఫిట్స్ వస్తాయి. మనిషి దాని ద్వారా పాక్షికంగా లేదా పూర్తి అపస్మాకరస్థితిలోకి వెళ్తాడు. బీపీ పూర్తిగా తగ్గిపోతుంది. బ్రెయిన్, కిడ్నీ పనితీరు మందగిస్తుంది. మూత్రం స్తంభించి ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది.

వడదెబ్బ తగలకుండా ఉండాలంటే...

- సాధ్యమైనంత వరకు మిట్ట మధ్యాహ్నం ఎండలో తిరగకుండా జాగ్రత్త వహించాలి. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇళ్లలోనే ఉండటం ఉత్తమం.
- తప్పనిసరిగా బయటకు వెళ్లవలసిన పరిస్థితిల్లో ఉప్పు కలిపిన మజ్జిగ లేదా ఉప్పు కలిపిన పండ్ల రసాలు, చల్లని నిమ్మరసం, కొబ్బరినీరు, మంచినీరు తాగాలి.
- వేసవికాలంలో తెల్లని దుస్తులు ధరించాలి. బాగా వదులుగా ఉండే కాటన్ వస్త్రాలు ధరిస్తే మంచిది.
- నల్లని వస్త్రాలు ధరించకూడదు.
- ఇంటి గదుల్లో ఉష్ణోగ్రతను తగ్గించేందుకు కిటికీలను, తలుపులకు తెరలను వాడి, వేడిని తగ్గించవచ్చు. ఫ్యాన్లు, ఎయిర్‌కూలర్లు, ఎయిర్ కండీషన్లు వాడాలి.
- శీతలంగా ఉన్న ప్రదేశాల్లో ఉండేందుకు ప్రయత్నించాలి.
- వేడిగా ఉన్న రోజుల్లో తప్పనిసరిగా గొడుగు, నెత్తికి టోపీ వాడాలి.
- శరీరం నుంచి చెమట రూపంలో నీరు ఎక్కువగా బయటకు పోతుంది. కాబట్టి సాధ్యమైనంత మేరకు, మంచినీరు ఎక్కువగా తాగాలి. కనీసం రోజుకు ఐదు లీటర్ల నీరు తాగితే మంచిది.
- ఎండలో పొలం పనులకు లేదా బయటకు వెళ్లకూడదు. ఒక వేళ అవసరమైతే ఉదయం, సాయంత్రం వేళల్లో బయటకు వెళ్లాలి.

తక్షణం వైద్య సహాయం అందించాలి



వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడగల ప్రదేశానికి తీసుకెళ్లాలి. శరీరంపై దుస్తులను తొలగించి చల్లని నీటిలో ముంచిన గుడ్డతో తుడవాలి. ఐస్ ముక్కలను గుడ్డతో ఉంచి శరీరం అంతా అద్దితే చాలా మంచిది. శరీరం అంతా చల్లని గాలి తగిలేలా చూడాలి. బాధితుడితో చల్లని నీరు లేదా ఉప్పు, ఇతర లవణాలు కలిపిన నీటిని తాగించాలి. వడదెబ్బ తగిలి అపస్మాకర స్థితిలో ఉన్న రోగికి నీరు తాగించకూడదు. అయితే ఇవన్నీ బాధితుడిని డాక్టర్ వద్దకు తీసుకెళ్లేలోగా చేయాలి. స్పృహ కోల్పోతే మాత్రం సమయం వృథా చేయకుండా వైద్య సహాయం అందించేందుకు ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ కె.సుధాకర్, వైద్యాధికారి, పీహెచ్‌సీ, ధవళేశ్వరం

జిల్లాలో భద్రతపై ఎస్పీ సమీక్ష



రోడ్డు కం రైల్వే బ్రిడ్జి, రైల్వే ట్రాక్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో భద్రత, ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఎయిర్ పోర్ట్, రైల్వే స్టేషన్, బస్టాండ్లు, పెట్రోల్ బంక్ కంపెనీలు తదితర ప్రధాన ప్రాంతాలు, వాటి విభాగాల సంబంధిత అధికారులతో సేఫ్టీ అండ్ సెక్యూరిటీపై శనివారం ఎస్పీ డి.నరసింహకిశోర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు తీసుకోవాల్సిన భద్రతా చర్యలను సంబంధిత అధికారులతో కలసి పరిశీలించామన్నారు. సేఫ్టీ అండ్ సెక్యూరిటీ పరంగా పాటించాల్సిన, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు, యాజమాన్యాలను సూచనలు చేసినట్టు ఎస్పీకి వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎల్.చెంచిరెడ్డి, ఎస్బీ డీఎస్పీ బి.రామకృష్ణ, ఏఆర్ డీఎస్పీ రవికుమార్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ అనసూరి శ్రీనివాసరావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు చీరల పంపిణీ

ధవళేశ్వరం: స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయం వద్ద శనివారం వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ధవళేశ్వరం గ్రామ దేవత ముత్యాలమ్మ ఆలయ నిర్వాహకులు మెండా సీతారామయ్య సహకారంతో వీటిని ట్రస్ట్ అధ్యక్షుడు ముత్యాల పోసి కుమార్ దంపతులు వృద్ధ మహిళలకు అందజేశారు.

పండ్లను మాగబెట్టేందుకు రసాయనాలు వినియోగించొద్దు

జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మామిడి పండ్లను రసాయనాలతో మాగ బెట్టి విక్రయించిన వారిపై, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్, ఎస్.చిన్నరాముడు హెచ్చరించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో శనివారం కృత్రిమంగా పండ్లను మాగబెట్టడం ఆరోగ్యానికి హానికరం అనే అంశంపై రైతులకు, వ్యాపారులకు, వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న జేసీ చిన్నరాముడు మాట్లాడుతూ సహజ సిద్ధంగా పండ్లను మాగపెడితే ప్రజల ఆరోగ్యానికి ఎటువంటి హాని కలుగుతుందని పేర్కొన్నారు. ఆ కోణంలో వ్యాపారులు ఆలోచించాలన్నారు. కృత్రిమంగా పండ్లను మాగబెట్టడం ఆరోగ్యానికి హానికరమని దీనిపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు సహజంగా పండిన పండ్లను ఎంచుకోవాలన్నారు. మామిడి పండ్లను కాల్షియం కార్బైడ్ వంటి రసాయనాలతో కృత్రిమంగా మాగబెట్టడం చాలా సాధారణమని ఈ పద్ధతి వల్ల పండ్లలో హానికరమైన రసాయనాలు చేరి, ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయన్నారు. కాల్షియం కార్బైడ్ వంటి రసాయనాలతో మాగబెట్టిన పండ్లను తింటే, గుండె జబ్బులు, శ్వాసకోశ వ్యాధులు, జీర్ణ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి, ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఎంచుకోవాలని తెలిపారు. జిల్లా ఆరోగ్య భద్రత అధికారి వి.రుక్కయ్య మాట్లాడుతూ రసాయనాలతో పండ్లు మాగపెట్టి విక్రయించే వ్యాపారులకు ఆరు నెలలు జైలు, రూ.5 లక్షలు జరిమానా, లైసెన్సు రద్దు చేస్తామన్నారు. ఎథలిన్ గ్యాస్ చాంబర్లు, రైఫిన్ ప్యాకెట్లు, గడ్డిలో వేసి పండ్లను మాగబెట్టాలని తెలిపారు. అనంతరం జేసీ చిన్నరాముడు రైపెనింగ్ చాంబర్‌ను పరిశీలించారు. జిల్లా మార్కెటింగ్ అండ్ ట్రేడింగ్ అధికారి ఎం.సునీల్‌వినయ్, జిల్లా ఉద్యానవనశాఖాధికారి బి.సుజాతకుమారి, డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ సురేష్‌కుమార్, మార్కెట్ కమిటీ కార్యదర్శి ఆంజనేయులు, ఉద్యానవనశాఖాధికారులు సుధీర్‌కుమార్, పి.రిని, రైతులు, వ్యాపారులు పాల్గొన్నారు.

శ్రీసత్యసాయి గురుకులానికి ఉత్తమ అవార్డు



శ్రీసత్యసాయి గురుకులం సాధించిన అవార్డుతో శ్యామసుందర్, గురవయ్య

రాజమహేంద్రవరం రూరల్: ఉచిత విద్య, మానవతా విలువల బోధనతో పది సంవత్సరాలుగా ఉత్తమ ఉత్తీర్ణత ఫలితాలు సాధిస్తున్న రాజమహేంద్రవరం శ్రీ సత్య సాయి గురుకులం ఎక్సలెన్సీ ఎడ్యుకేషనల్ స్టాండర్స్ అడాప్టబిలిటీ అండ్ ఇంప్లిమెంటేషన్ అవార్డు అందుకుంది. ఈమేరకు స్కూల్ కరస్పాండెంట్ అయోధ్యుల శ్యామసుందర్, ప్రిన్సిపాల్ కె. గురవయ్య తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ఈ నెల 25న బెంగళూరులో బేగినప్ వెంచర్స్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో సంస్థ సభ్యులు ఈ అవార్డును అందించారన్నారు. రాష్ట్రంలో రెండు పాఠశాలలోనూ గురుకులం కూడా ఒకటి ఉండటం సంతోషంగా ఉందని, భగవాన్ శ్రీ సత్య సాయిబాబా దివ్య ఆశీస్సులతో, ఉపాధ్యాయులు, విద్యార్థుల కృషితో ఉన్నత విలువలు, ఉత్తమ ఫలితాలతో ఈ అవార్డును పొందామన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామన్నారు. అవార్డు ప్రదానం చేసిన సంస్థకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

సమష్టి కృషితో వైఎస్సార్ సీపీకి పునర్వైభవం



మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను అభినందిస్తున్న పార్టీ నాయకులు

మాజీ మంత్రి, జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: నాయకులు, కార్యకర్తలందరూ వైఎస్సార్ సీపీకి పునర్వైభవం తీసుకువచ్చేందుకు సమష్టిగా కృషి చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. శనివారం ఆయనను ఇటీవల జిల్లా పదవుల పొందిన నేతలు కలసి వేణుగోపాలకృష్ణకు పుష్పగుచ్ఛం, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నేతలు అనుసరిస్తున్న అరాచక పాలనను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు దక్కుతుందన్నారు. ఇటీవల పదవులు పొందిన జిల్లా క్రిస్టియన్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎంఎస్ఎస్ఎన్ విజయసారధి, జిల్లా అధికార ప్రతినిధి పెయ్యల రాజేష్, జిల్లా ఉపాధ్యక్షుడు బొప్పన సుబ్బారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తాడాల విష్ణుచక్రవర్తి, ఆర్గనైజర్ సెక్రటరీ యెనుముల త్యాగరాజు, యాక్టివిటీ సెక్రటరీ కొప్పినీడి ప్రసాద్‌బాబు (రాజమౌళి)ని మాజీమంత్రి చెల్లిబోయిన వేణును సత్కరించారు.ఈ కార్యక్రమంలో అంగాడి సత్యప్రియ, చింతపర్తి రాంబాబు, నక్కా రాజేంద్ర, షేక్ ఇబ్రహీం బాషా, సుందరపల్లి అనిల్, సిరసపల్లి శంకరరావు, బీదంరాజు, కాకులపాటి కుమార్ పాల్గొన్నారు.

ఉగ్రదాడి అమానవీయం



ఉగ్రదాడిని ఖండిస్తున్న పాస్టర్స్ ఫెలోషిప్ కార్యవర్గ సభ్యులు

కడియం: పహల్గామ్‌లో ఉగ్రవాదులు భారతీయులపై దాడి చేసి పలువురు పర్యాటకులపై కాల్పులు జరపడం అమానవీయమని కడియం మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఎగ్జిక్యూటివ్ బాడీ ప్రత్యేక సమావేశంలో ఖండించింది. ఫెలోషిప్ ప్రెసిడెంట్ రెవ డీఎల్ మోడీ చర్చిలో నిర్వహించిన ఈ సమావేశంలో ఫెలోషిప్ నాయకులు యం.కరుణాకర్, డి.పరంజ్యోతి, ఎగ్జిక్యూటివ్ బాడీ సభ్యులు హాజరయ్యారు. మతాల మధ్య చిచ్చుపెట్టే విధంగా ఉగ్రవాదులు వ్యవహరించడాన్ని సమావేశం తీవ్రంగా ఖండించింది. పర్యాటకుల మరణానికి కారణమైన వారికి కఠినంగా శిక్షించాలని కోరారు. ఇటువంటి పరిస్థితులను దేశ ప్రజలంతా ఐక్యంగా ఎదుర్కోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జయశీల్, బిషప్ సాలోమోను, జీవరత్నం, సామ్యూల్‌రాజు, రత్నదీప్ పాల్గొన్నారు.

ఫిషింగ్ బోట్లను చేపల వేటకు మాత్రమే వినియోగించాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మత్స్యశాఖ జేడీ నిర్మలాకుమారి

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): లైసెన్స్ తీసుకున్న ఫిషింగ్ బోట్లను చేపల వేటకు మాత్రమే వినియోగించాలని జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్.నిర్మలాకుమారి అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక పుష్కరఘాట్‌లో స్విమ్మర్స్ క్లబ్ వద్ద గోదావరి నదిలో చెక్క పడవలు (నావలు), తెప్పలు (ఫైబర్ బోటు)పై చేపల వేట చేసే మత్స్యకారులకు ఫిషింగ్ లైసెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో నిర్మలాకుమారి మాట్లాడుతూ జీవో 1012 ప్రకారం మత్స్యకారులకు గోదావరిలో చేపల వేటకు ఏటా లైసెన్సులను జారీ చేస్తామన్నారు. ఈ లైసెన్సులను కేవలం చేపల వేటకు మాత్రమే ఉపయోగించాలని, ఇసుక రవాణా, బోటు షికారుకు పర్యాటకులను తీసుకువెళ్లడం, నిషేధిత వస్తువులు రవాణాకు వినియోగించరాదన్నారు. అలా చేస్తే లైసెన్సు రద్దు చేసి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. మత్స్యశాఖ ఏడీ షేక్‌దిల్షద్, త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, ఎఫ్‌డీవో ఎస్‌బీ గణేశ్వరరావు ,టూరిజం ఆఫీసర్ కె.సురేష్, మత్స్యకారులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ

కంబాలచెరువు : స్థానిక గరిమెళ్ల సత్యనారాయణ బీఈడీ కాలేజీలో శక్తి యాప్‌పై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ ఆదేశాల మేరకు శక్తి టీం ఆధ్వర్యంలో మహిళలపై జరుగుతున్న నేరాలపై జిల్లా ఇన్‌చార్జ్ నోడల్ ఆఫీసర్, డీఎస్పీ కేవీ సత్యనారాయణ అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలపై జరిగే లైంగిక దాడులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలకు సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్, సైబర్ నేరాలు, సోషల్ మీడియా యాప్స్ నష్టాలపై అవగాహన కల్పించారు. శక్తి యాప్ ఉపయోగాలను తెలుసుకుని మహిళలు అందరూ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు. మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సై ఎస్‌కే అమీనాబేగం పాల్గొన్నారు.

మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం



మాట్లాడుతున్న జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీహెచ్ లావణ్య

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జీవితాలను విచ్ఛిన్నం చేస్తున్న మాదకద్రవ్య అలవాట్లను మానుకోవాలని, మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీహెచ్.లావణ్య పేర్కొన్నారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఈగల్ టీం (ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) ఆధ్వర్యంలో శనివారం ఖైదీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్తు పదార్థాలు సేవించినా, ఇతరులకు సరఫరా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వల్ల యువత భవిష్యత్తు నాశనమవుతోందన్నారు. వాటి బారి నుంచి యువతను కాపాడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అడిషనల్ ఎస్పీ పి.మురళీకృష్ణ మాట్లాడుతూ యువత తమ అవసరాలకు చిన్న తప్పులతో మొదలుపెట్టి వాటిని వ్యసనాలుగా మార్చుకుని జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ ఎస్.రాజ్‌కుమార్ మాట్లాడుతూ మత్తు మైకంలో అనేక అకృత్యాలు, నేరాలు చేసి విలువైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. అనంతరం ఖైదీలతో మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా అడిషనల్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ పీఎస్.రాహుల్, వైద్యా ధికారి కే సుబ్బరాజు, డిప్యూటీ సూపరింటెండెంట్ రత్నరాజు, ఉపాధ్యాయులు చిలుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి దోపిడీ

- కూటమి నాయకుల అండతో అక్రమాలు
- కడియపులంక పంట కాలువలో మట్టి తవ్వకం



కడియపులంక వద్ద పంట కాలువలో యంత్రాలతో మట్టి తవ్వకాలు

కడియం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అక్రమార్కులు పేట్రేగిపోతున్నారు. నిన్న మొన్నటి వరకు పొట్టిలంక శివార్లలో, కడియపులంక పంచాయతీ పరిధిలోని గోదావరి లంకల్లో మట్టి దోపిడీని కొనసాగించారు. అధికారులెవ్వరూ ఆవైపు కూడా కన్నెత్తి చూడకపోవడంతో ఇప్పుడు ఏకంగా ఇరిగేషన్ కాలువలోనే మట్టి దోపిడీకి తెరతీసారు. కోటిపల్లి కాలువను ఆనుకుని ఉన్న పంట కాలువలో రెండు రోజులుగా దాదాపు వంద ట్రాక్టర్ల వరకు మట్టిని జేసీబీలతో తవ్వి తీసుకుపోతున్నారని గ్రామస్తులు తెలిపారు. ట్రాక్టరు మట్టిని రూ. 1,800 నుంచి రూ. 2,400 వరకు అమ్ముకుని సొమ్ములు చేసుకుంటున్నారంటున్నారు.

స్పందించని అధికారులు

జాతీయ రహదారిని ఆనుకుని జరుగుతున్న ఈ మట్టి దోపిడీ సమాచారం రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్ యంత్రాంగానికి తెలిసినప్పటికీ కనీసం ఆ వైపు కూడా కన్నెత్తి చూడకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా బహిరంగంగా మట్టిని దోచుకుపోతున్నప్పటికీ సంబంధిత శాఖల క్షేత్రస్థాయి సిబ్బంది కూడా అడ్డుచెప్పకపోవడంతో ఈ దోపిడీలో వారికి కూడా భాగస్వామ్యం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. జేసీబీలు, ట్రాక్టర్లతో సహా రెండు రోజులుగా హైవేను ఆనుకుని మట్టి తవ్వకాలు, రవాణా సాగుతోంది. కడియం మండలంలో ఇసుక, గోదావరిలంక మట్టి తదిరాలను పెద్ద నాయకుల ప్రమేయంతో నేరుగా కొందరు బడా నేతలు దోచుకుపోతున్నారు. దీంతో వార్డు సభ్యుల స్థాయిలో కూటమి నాయకులు ఇలా ఇరిగేషన్ స్థలాలు వంటి చోట్ల దోపిడీకి పాల్పడుతున్నారని గ్రామస్తులు అంటున్నారు. కడియపులంక పంచాయతీకి సంబంధించిన కొందరు వార్డు సభ్యులే ఇరిగేషన్ మట్టిని దోచుకోవడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.